సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 23 । ఆగస్టు । 2023



అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

రోడ్ల వెంట ఉండే ఇళ్లలో చోరీలకు పాల్ప డుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



శతఘటాభిషేకం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. - 12లో



బీఆర్ఎస్ మళ్లీ వస్తేనే..

రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే ప్రజలు బాగుపడతారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ల నియామకం

నల్లగొండ: బీజేపీ నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్‌గా బండారు ప్రసాద్, జాయింట్ కన్వీనర్‌గా మన్మథరెడ్డిని నియమించారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంట్ కన్వీనర్‌గా బండారపు లింగస్వామి, జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, సి.నారాయణయాదవ్‌లను నియమించారు.

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై హైకోర్టు స్టే

భువనగిరి: భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామం నుంచి సుమారు 15 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులపై మంగళవారం హైకోర్టు స్టే ఇచ్చింది. గత సంవత్సరం రాయగిరికి చెందిన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న 29 మంది రైతులు గత సంవత్సరం మార్చి 10న అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది బ్రహ్మాండం డి రమేష్ కోర్టులో వాదించారు. పిటిషన్‌పై రెండు సార్లు విచారణ జరగగా, నాలుగు సార్లు వాయిదా పడింది. మంగళవారం హైకోర్టులో సింగిల్ బెంచ్‌లో విచారణకు వచ్చిన అనంతరం భూ బాధితుల తరఫున వాదనలు విన్న అనంతరం జడ్జి సుదీర్‌కుమార్ స్టే విధించినట్లు రైతు తంగళ్లపల్లి రవికుమార్ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల కోసం భూములను తీసుకుందని రైతులు తెలిపారు. ఎప్పటికైనా తమకు కోర్టు న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భువనగిరి: మహాత్మా జ్యోతిబాపూలే బాలుర డిగ్రీ కళాశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ సుభాషిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కళాశాలలో ప్రస్తుతం బీఎస్సీ (కంప్యూటర్), బీఏ (ఈపీహెచ్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్, బీజెడ్సీ) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. హాస్టల్ సౌకర్యంతో పాటు పుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను భువనగిరి మండల పరిధిలోని అనంతారం గ్రామ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ఈ నెల 31వ తేదీలోపు అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 88975 43021 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: 2023-24 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్) పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో 31.12.2023 వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలేరురూరల్: ఆలేరు పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చక్రపాణి, డిప్యూటీ తహసీల్దార్ ఇంద్రీస్, ఎంపీడీఓ జ్ఞాన ప్రకాష్, ఎంపీఓ సలీం, సీడీపీఓ చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, గజవాహన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

గెలుపు వ్యూహం

టికెట్ ఖరారుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మరింత ఉత్సాహం

- ఇక నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండేలా కార్యాచరణ
- నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలిసేలా ప్రణాళిక
- అసమ్మతి నేతలతో బుజ్జగింపులకు ప్రయత్నాలు

సాక్షి, యాదాద్రి: మూడు నెలల ముందే టికెట్ ఖరారు కావడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే జనంలో ఉంటున్న ఎమ్మెల్యేలు రెట్టించిన ఉత్సాహంతో తమ కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. తమ నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలవడానికి ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోయే పనిలో పడ్డారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, గతంలో ఇచ్చిన వ్యక్తిగత హామీలను పూర్తిచేసే యోచనలో ఉన్నారు. మరోవైపు అక్కడక్కడా వినిపిస్తున్న అసమ్మతి స్వరాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. టికెట్ లభించిన ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యలు మంగళవారం ప్రగతి భవన్‌కు వెళ్లి అధినేత కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంత్రి జగదీశ్‌రెడ్డిని కలి శారు.

గెలుపును సునాయాసం చేసుకునేందుకు..

భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యేలు గెలుపు వ్యూహాలను రచిస్తున్నారు. 2018లో ఆరు నెలల ముందు టికెట్లు ప్రకటించిన అధినేత, 2023లో మూడు నెలలముందు టికెట్లు ప్రకటించారు. ఎన్నికల్లో గెలుపును సునాయాసం చేసుకోవడానికి చర్యలు ప్రారంభించారు. ప్రధానంగా ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఎక్కడైనా అసమ్మతి ఉంటే దానిని పరిష్కరించుకునే దిశగా చర్యలు ప్రారంభించారు. మండలాల వారీగా సీనియర్ నాయకులకు బుజ్జగింపు బాధ్యతలను అప్పగించారు. వారి నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా అసమ్మతి నాయకులతో నేరుగా మాట్లాడాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. దీంతోపాటు ఇతర పార్టీల్లో బలంగా ఉన్న వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇందుకోసం వారికి రానున్న స్థానిక సంస్థల పదవులను ఆశ చూపుతూ హామీలు ఇస్తున్నారు.

అసమ్మతి నేతలతోనే ఇబ్బంది

టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్, అసమ్మతి నేతలను బుజ్జగించడానికి ప్రయత్నాలు చేస్తున్నా వారి నుంచి సరైన స్పందన లభించడం లేదని తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి టికెట్ లభించకపోవడం తీవ్ర నిరాశను మిగిల్చింది. యాదాద్రి జిల్లాలో ఇప్పటి వరకు అసమ్మతి నాయకులెవరూ పెద్దగా బయటపడలేదు. కానీ, అంతర్గతంగా తమ అసమ్మతిని అనుచరుల వద్ద వెలిబుచ్చుతున్నారు. ప్రత్యామ్నాయ కార్యాచరణ రూపొందించే పనిలో పడ్డారు. తమకు అవకాశం వస్తుందని భావించినా రాకపోవడంతో సీనియర్ నాయకులు తీవ్ర నిరాశలో ఉన్నారు. అసమ్మతి నాయకులను తమ వైపు తిప్పుకోవడానికి ఎమ్మెల్యేలు కొంత వరకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారు అధిష్టానం నుంచి వచ్చే హామీ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు మూడు నెలలు ఉండగా, ఇంకా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో సీనియర్లు తమ రాజకీయ భవిష్యత్ కోసం చర్చలు జరుపుతుండడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారింది. అధిష్టాన ఆదేశాలతో అసంతృప్తి చల్లారుతుందన్న నమ్మకంతో ఉన్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

నామినేషన్ల నాటికే మొదటి దశ ప్రచారం పూర్తి కావాలే

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్ అభ్యర్థులంతా నామినేషన్ల ప్రారంభం నాటికే మొదటి దశ ప్రచారం పూర్తి చేసుకోవాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఎన్నికల్లో బరిలో నిలువబోయే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ నెల రోజుల్లో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందని, అందరూ నిత్యం ప్రజల్లో ఉండేలా, వారితో మమేకం అయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వారికి వివరించాలని సూచించారు. రైతులు ఎక్కువగా ఉన్న జిల్లా అయినందున అభ్యర్థులంతా రైతులపై దృష్టి కేంద్రీకరించి పనిచేయాలని చెప్పారు. తద్వారా ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలను గెలుచుకోవచ్చని తెలిపారు. ఆశావహులు, అసంతృప్తులు అందరిని పిలిచి మాట్లాడి కలుపుకుపోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ బలాబలాలపైనా కేసీఆర్ ఆరాతీశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిషోర్‌కుమార్, రవీంద్రకుమార్, నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ కుమార్ ఉన్నారు. కాగా, మొదటగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత అందరూ కలిసి సీఎం వద్దకు వెళ్లారు.



ఉమ్మడి జిల్లా నేతలకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం కేసీఆర్

గాంధీ భవన్ బాట..

దరఖాస్తులు సమర్పిస్తున్న కాంగ్రెస్ ఆశావహులు

- కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ అసంతృప్తులు

సాక్షి, యాదాద్రి: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున టికెట్ ఆశించే వారి నుంచి పీసీసీ దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ఈమేరకు ఆశావహులు గాంధీ భవన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు క్యూ కడుతున్నారు. ఈ నెల 18 నుంచి ప్రక్రియ ప్రారంభం కాగా.. 25వ తేదీ వరకు గడువు ఉంది. సోమవారం మంచి రోజుగా భావించి పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. కొందరు దరఖాస్తు ఫారాలను తెచ్చుకుని బుధవారం సమర్పించడానికి సిద్ధం చేసుకున్నారు.

కొనసాగుతున్న సర్వేలు

బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఎంపిక చేయడానికి వివిధ మార్గాల్లో సర్వే చేయిస్తోంది. ఏఐసీసీ, పీసీసీ, భువనగిరి ఎంపీ, డీసీసీ, వ్యక్తిగత సర్వేలు ఆయా నియోజకవర్గాల్లో జోరందుకున్నాయి. సర్వేల ఆధారంగా అభ్యర్థులకు టికెట్ ఇస్తారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రజల్లో పలుకుబడితో పాటు అన్ని విధాలుగా సమర్థత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉంది. కాగా.. బీఆర్ఎస్ పార్టీలో టికెట్ రాని వారు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బీఆర్ఎస్ టికెట్ ఆశించినప్పటికీ ఆయనకు నిరాశే ఎదురైంది. భువనగిరిలో బీఆర్ఎస్ టికెట్ ఆశించిన చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. తన అనుచరులతో భారీ ఎత్తున చేరికకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. వీరితో పాటు టికెట్ ఆశించిన మరికొందరు ఆయా పార్టీలను వదిలి కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధమవుతున్నారు.

దరఖాస్తులు సమర్పించిన నేతలు..

- ఆలేరు నియోజకవర్గం నుంచి పీసీసీ కార్యదర్శి బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.నగేష్, సీనియర్ నాయకులు బండ్రు శోభారాణి, బోరెడ్డి అయోధ్యరెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి, జనగాం ఉపేందర్‌రెడ్డిలు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి, మోటకొండూరు మండల శాఖ అధ్యక్షుడు ఎల్లంల సంజీవరెడ్డిలతోపాటు మరికొందరు దరఖాస్తు చేసుకోనున్నారు.
- భువనగిరి నియోజకవర్గం నుంచి పంజాల రామాంజనేయులు, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, పోత్నక్ ప్రమోద్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, తంగళ్లపల్లి రవికుమార్, మరికొందరు దరఖాస్తు చేయనున్నారు.
- తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఇంచార్జ్ గుడిపాటి నర్సయ్య, అద్దంకి దయాకర్, రవి, కరుణాసాగర్ దరఖాస్తు చేసుకోనున్నారు. అడ్డగూడూరు మండలానికి చెందిన ఇటిక్యాల చిరంజీవి దరఖాస్తు చేసుకున్నారు.
- మునుగోడు నుంచి చలమల్ల కృష్ణారెడ్డి దరఖాస్తు చేసుకోగా, సీనియర్ నాయకురాలు పాల్వాయి స్రవంతి, తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకుడు పున్న కైలాస్ నేత దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.
- నకిరేకల్ నుంచి దైద రవీందర్, కొండేటి మల్లయ్య, వేదాసు శ్రీధర్, ప్రసన్న రాజు దరఖాస్తు చేసుకోనున్నారు. అయితే, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బీఆర్ఎస్ నుంచి టికెట్ రాకపోవడంతో బుధవారం నకిరేకల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేసి తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది. ఆయన కాంగ్రెస్‌లో చేరితే అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.



భువనగిరి నియోజకవర్గ టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న పంజాల రామాంజనేయులు



ఆలేరు నుంచి దరఖాస్తును అందజేస్తున్న బండ్రు శోభారాణి

ముఖ్యనాయకుల ఆశీస్సులు పొందేందుకు..

కాంగ్రెస్ ముఖ్య నేతల ఆశీస్సుల కోసం ఆశావహులు పోటీ పడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి, దామోదర్‌రెడ్డి వంటి అగ్రనేతల ఆశీస్సుల కోసం తాపత్రయ పడుతున్నారు. తమకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు.

మొక్కల పంపిణీకి సిద్ధం

- 26న మున్సిపాలిటీల్లో 4లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిషనర్లు

భువనగిరిటౌన్: జిల్లాలోని మున్సిపాలిటీలను హరితవనాలుగా తీర్చిదిద్దే దిశగా అధికారులు, పాలకవర్గాలు అడుగులు వేస్తున్నాయి. ఆరు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న 20 నర్సరీల్లోని 8.50కోట్ల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించి వాటి ప్రయోజనాలను సమాజానికి అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన అన్ని మున్సిపాలిటీల్లో 4లక్షల మొక్కలు నాటేందుకు ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. హరితహారం లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

మొక్కలు విస్తృతంగా నాటేలా..

26వ తేదీన కోటి మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈమేరకు ఆయా మున్సిపాలిటీల పరిధిలో ప్రతి వార్డులో 750 మొక్కల చొప్పున ఆరు మున్సిపాలిటీల్లో ఒకేరోజు 4 లక్షల మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. భువనగిరి మున్సిపాలిటీలో 1.59.900మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టారు. ఇప్పటికే 84వేల మొక్కలును హెచ్ఎండీఏ లేవుట్ తదితర ప్రాంతాల్లో నాటారు. ప్రస్తుతం వంద శాతం లక్ష్యం కోసం 84.485 మొక్కలు నాటాల్సి ఉంది. కాగా.. ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీల్లో 1.4లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టారు.



భువనగిరి మున్సిపాలిటీలోని నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న కమిషనర్ నాగిరెడ్డి

ప్రతి ఇంటికీ 4 మొక్కలు..

మున్సిపాలిటీల్లోని ప్రతి ఇంటికీ నాలుగు మొక్కలను పంపిణీ చేస్తున్నారు. వాటిలో పండ్ల మొక్కలు జామ, దానిమ్మ, అల్ల నేరేడు, పూలమొక్కలు, ఔషధ మొక్కలు, తులసి, ఉసిరి, హెన్నా, అశ్వగంధం, గన్నేరు ఉన్నాయి. ప్రస్తుతం ఇంటింటికీ నాలుగు మొక్కలు పంపిణీ చేస్తుండగా అవసరమైన వారికి మరిన్ని మొక్కలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

భువనగిరి మున్సిపాలిటీ పరి ధిలో ఉన్న 35 వార్డుల్లో మొక్కలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాం. ఈ నెల 26న వార్డుల్లో పంపిణీ చేస్తున్నాం. ఇంటింటి పంపిణీ చేస్తున్న మొక్కలు ఇంటి ఆవరణలో నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలి. ప్రతిఒక్కరూ హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన



మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఉన్నతి కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎంతో మంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. విద్యార్థులకు తరగతి విద్యాబోధన సక్రమంగా జరగాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సబ్జెక్టు ఉపాధ్యాయులకు సూచనలు చేసి విద్యార్థుల అభ్యసనంలో మార్పులు తీసుకురావాలన్నారు. విద్యార్థులను విభజన చేసి, అభ్యసనా ఫలితాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ఉన్నతి కార్యక్రమం ద్వారా తీర్చిదిద్దాలన్నారు. అంతకు ముందు శిక్షణ కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి ఉన్నారు.

వందశాతం పోలింగ్‌కు సహకరించాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

భువనగిరిటౌన్: వంద శాతం పోలింగ్‌కు సహకరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ప్రచార కార్యక్రమాల్లో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన సీనియర్ సిటిజెన్స్, దివ్యాంగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు చైతన్యానికి సంబంధించి జిల్లాలో స్వీప్ ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్టోబరు 19 వరకు ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఓటు నమోదు, మార్పుల కోసం ఫారమ్ 6, 7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చనని పేర్కొన్నారు. అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని కోరారు. 80 సంవత్సరాలు నిండిన వారికి, దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్‌స్టేషన్‌కు రాలేని వారి కోసం ఇంటి వద్దే ఓటు వేసే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గతంలో జిల్లాలో 91 శాతం పోలింగ్ నమోదైందని, దీనిని పెంచేందుకు స్వీప్ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ మంచికంటి వెంకటేశం, శెట్టి బాలయ్య, మల్లేశం, నర్సింహారావు, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, కిష్టయ్యలను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు శెట్టి బాలయ్య, జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అధ్యక్షుడు శంకర రెడ్డి, జిల్లా సీనియర్ సిటిజెన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బాలేశ్వర్, స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దారు అంజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్ కిష్టయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

ప్రధానోపాధ్యాయుడిపై డీఈఓ విచారణ

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న యాదగిరిపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం డీఈఓ నారాయణరెడ్డి విచారణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సమయపాలన పాటించడం లేదని, పాఠశాల నిర్వహణ సక్రమంగా చేయడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు తొంట తిరుపయ్య, ఎర్రవెల్లి నాగేశ్వర్ ఇటీవల ఫోన్‌ద్వారా డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డీఈఓ పాఠశాలను సందర్శించి ప్రాథమిక విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు గ్రామస్తులు ఎర్రవెల్లి కృష్ణ, ఎర్రవెల్లి కిరణ్, తొంట నరేష్, ఎర్రవెల్లి నవీన్, చిలుక రాములు తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్యతోపాటు, గైర్హాజరైన విద్యార్థుల హాజరు శాతం కూడా నమోదు చేసి మధ్యాహ్న భోజనం వండుతున్నట్లు గుర్తించారు. ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై కమిటీ వేసి పూర్తి స్థాయి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు. కాగా.. విచారణ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు యాదగిరి అనుమతి లేకుండా గైర్హాజరు కావడం గమనార్హం. డీఈఓ వెంట ఎంఈఓ శ్రీధర్ ఉన్నారు.



విచారణ చేస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత

భువనగిరిటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని కలెక్టరేట్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కార్యాలయ గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు లేవన్నారు. సంక్షేమ హాస్టల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు నేటికీ అమల్లోకి రావడం లేదని ఆరోపించారు. భువనగిరి చౌటుప్పల్, మోత్కూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక చాలామంది విద్యార్థులు పై చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పోరాటాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు చింతల శివ, కాసుల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు లావుడియా రాజు, వేముల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల రాహుల్, మేకల జలంధర్, వేముల పవన్, కంబాలపల్లి సాయి, బుగ్గ ఉదయ్ కిరణ్, పరమేశ్వర్, పుట్టల ఉదయ్, నాయకులు వసంత, లక్ష్మి, సౌందర్య, అఖిల, నాగారం శివ రాయమోజి రమణ, నేహాల్, వంశీ, కార్తీక్, అఖిల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో వర్షం

భువనగిరిటౌన్: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. వారం రోజుల నుంచి ఉక్కపోతలో ఇబ్బంది పడ్డ ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఆలేరు మండలంలో 25 మిల్లీమీటర్లు, రామన్నపేటలో 20 మి.మీ., మోత్కూర్‌లో 16 మి.మీ., యాదగిరిగుట్టలో 5.5, మోటకొండూర్ 2.3, చౌటుప్పల్‌లో 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 మేకలు మృతి



ఘటనాస్థలిలో మేకల కళేబరాలు

చౌటుప్పల్ : పిచ్చికుక్కల దాడిలో మేకలు మృతిచెందాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామపంచాయతీ మధిర శేరీల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెబోయిన లక్ష్మయ్య రోజువారీ మాదిరిగా తన మేకలను దొడ్లో తోలి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు దొడ్లోకి వెళ్లి దాడికి పాల్పడ్డాయి. దీంతో 15మేకలు మృతిచెందాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పశువైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

గురుకుల పాఠశాలలో విచారణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంళవారం బాలల సంక్షేమ సమితి అధికారులు విచారణ నిర్వహించారు. ఆత్మహత్యకు గల కారణాలను తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమితి చైర్మన్ రమణారావు, డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

- నిందితులపై నల్లగొండ జిల్లాలో 20కి పైగా చోరీ కేసులు
- రహదారుల వెంట తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- రూ.60లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

మిర్యాలగూడ అర్బన్ : రహదారుల వెంట ఉండే ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసారావుపేట ఎస్‌టీఓ కాలనీకికి చెందిన జంగా వెంకట్‌రావు, అదే జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్ వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బులు సంపాదించాలని చోరీలకు పాల్పడుతున్నారు. 2011లో నరసారావుపేటలో దొంగతనం చేసి జైలు జీవితం గడిపారు. బయటికి వచ్చాక టీ స్టాల్ నడిపినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ దొంగతనాలు మొదలు పెట్టారు. అయితే పల్నాడులో దొంగతనాలు చేస్తే దొరికిపోతామనే ఉద్దేశంతో మకాం నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ పట్టణానికి మార్చారు.

టంగ్ క్లీనర్‌తో టవర్‌బోల్ట్ తొలగించి..

నిందితులిద్దరూ రహదారుల వెంట తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. ఎంపిక చేసుకున్న ఇంటి ఆవరణలోకి అర్ధరాత్రి సమయంలో ప్రవేశించి తొలుత కిటికీ అద్దాలను ఇనుపరాడ్డుతో పగులగొడతారు. అనంతరం కర్రకు టంగ్ క్లీనర్ కట్టి దాని సహాయంతో కిటికీ టవర్‌బోల్ట్ తీసి ఆపై ఇంటి లోపలికి ప్రవేశిస్తారు. అనంతరం ఇంట్లోని విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరిస్తారు. ఇలా దొంగలించిన బంగారు ఆభరణాలను నరసారావుపేటలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. వీరు మిర్యాలగూడలో 16కు పైగా ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల మిర్యాలగూడలో నిఘా ఎక్కువకావడంతో మకాం నల్లగొండ జిల్లా కేంద్రానికి మార్చి నాలుగు ఇళ్లలో ఇదే తరహాలో చోరీలు చేశారు.

తనిఖీల్లో పోలీసులకు చిక్కి..

ఇటీవల మిర్యాలగూడలో చోరీ చేసిన బంగారు ఆభరణాలను క్రయించేందుకు అప్పటికే అపహరించిన మారుతి స్విఫ్ట్ కారులో ఇద్దరు నిందితులు హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో మిర్యాలగూడ మండలం నందిపాడు చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వీరి కారును నిలిపి ధ్రువపత్రాలు చూపించాలని కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల నేరాలను అంగీకరించారు. నిందితుల నుంచి 83 తులాల బంగారం, 8 తులాల వెండి, మారుతి షిఫ్ట్‌కారు, రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.60 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐలు నర్సింహారావు, రాఘవేందర్, నల్లగొండ సీసీఎస్ పోలీసు అధికారులు జితేందర్ రెడ్డి, లక్ష్మయ్య, ఎస్ఐలు కృష్ణయ్య, రామ్మూర్తి, శివ కుమార్, రాంబాబు, కానిస్టేబుళ్లు విష్ణువర్ధనగిరి, వెంకటేశ్వర్లు, నరేష్, అక్బర్, రామకృష్ణ, రవి, వెంకటేశ్వర్లు, హోంగార్డు సోమ్లానాయక్, సైదా నాయక్, దయాకర్‌ను ఎస్పీ అభినందించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



దుర్గాప్రసాద్ ఇంట్లో చిందరవందరగా వస్తువులు

కట్టంగూర్ : గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని అయిటిపాముల గ్రామంలో హైవే పక్కనే ఉన్న ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ఎస్.దుర్గాప్రసాద్ రెండు రోజుల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం తిరిగి ఇంటి వచ్చేసరికి తలుపుల తాళం పగులగొట్టి ఉండటం గమనించాడు. లోనికి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి అందులో ఉంది. అందులోని రూ.50 వేల నగదుతో పాటు మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

తూప్రాన్‌పేటలో..

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన దేవరశెట్టి నర్సింగ్‌రావు కుటుంబసభ్యులతో కలిసి బోనాల పండుగ నిమిత్తం రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. పండుగ ముగిసిన అనంతరం మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. లోనికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో భద్రపరచిన తులంన్నర విలువైన బంగారు ఆభరణాలు, 12తులాల వెండి ఆభరణాలు, 02వేల రూపాయల నగదు దొంగతనానికి గురైనట్టుగా గుర్తించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ

బొమ్మలరామారం : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి, బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ శివం ఉపాధ్యాయ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. బొమమలరామరం మండలంలోని తిర్మలగిరి గ్రామ సమీపంలో గల అనురాగ్ స్టోన్ క్రషర్ కొంతకాలంగా మూత పడిఉంది. ఈ నెల 15న క్రషర్‌కు గల ఇనుప కంచెను తొలగించిన దుండగులు 40 హెచ్‌పీ మోటారును చోరీ చేశారు. విషయం తెలుసుకుని క్రషర్ యాజమాని మోడిపల్లి చిన్న రమణ ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలసి మంగళవారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసీఐఎల్, కాప్రాలో నివాసం ఉంటున్న బీబీనగర్ మండలం జియాపల్లి తండాకు చెందిన బానోత్ రవి కుమార్ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. రవి కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా స్టోన్ క్రషర్‌లో మోటారు చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. పోలీసులు అతడి నుంచి మోటారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కట్టంగూర్ : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిటిపాముల గ్రామానికి చెందిన కొవ్వూరి రంజిత్‌కుమార్(30) ఓ రాజకీయ పార్టీలో కోశాధికారిగా పనిచేస్తున్నాడు. ఇల్లు గడవటం కష్టంగా మారటంతో గ్రామస్తుల వద్ద సుమారు రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం తెల్లవారుజామున ఇంటిపై కప్పు ఐరన్‌పైపునకు చీరతో ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటికి కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బైక్ రుణ వాయిదాలు చెల్లించలేక..

నకిరేకల్ : బైక్ రుణ వాయిదాలు చెల్లించలేక పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన మాచర్ల సైదులు(29) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరునెలల క్రితం నెలసరి వాయిదాల చెల్లింపు కింద బైక్ కొనుగోలు చేశాడు. వాహనానికి సంబంధించిన నెలసరి వాయిదాలు చెల్లింపులో జాప్యం కావడంతో సంబంధిత వ్యక్తులు ఒత్తిడికి గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన సైదులు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కొంత సమయం తర్వాతా ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అతడిని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సైదులు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి విజయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

రాజాపేట : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని జాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పంచాయతీ ఎలక్ట్రీషన్ గుంటి భీష్మారెడ్డి స్థానిక జేఎల్ఎంకు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భీష్మారెడ్డి గ్రామంలోని విద్యుత్ స్తంభంపై తీగలు సరిచేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభం పైనుంచి కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఈసీఐఎల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామ పంచాయతీ గంటారావుపేటకు చెందిన కనకం మహేష్(21) మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీ జంక్షన్ నుంచి ఫ్లై ఓవర్ వైపునకు స్కూటీపై వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో మహేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం కావడంతో వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బావిలో పడి ఆర్ఎంపీ మృతి

మేళ్లచెరువు : బావిలో పడి ఆర్ఎంపీ మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని కందిబండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కందిబండ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పిన్నపురెడ్డి సైదిరెడ్డి (52) ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పొలానికి నీళ్లు పెట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో జారి పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత స్థానిక రైతులు గమనించగా అప్పటికే మృతిచెందాడు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నాంపల్లి : కుటుంబ కలహాలతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నాంపల్లి మండలం కలమందబావి గ్రామానికి చెందిన నూనావత్ రేద్యా, సరిత(38) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం గొడవ జరగడంతో సరిత మనస్తాపానికి గురైంది. అనంతరం వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుంది. సమీప వ్యవసాయ కూలీలు గమనించడంతో అప్పటికే మృతిచెందింది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

గాయపర్చిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

నిడమనూరు: భూతగాదాలో ఒకరిని నోటితో కొరికి గాయపర్చిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష లేదా రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న మంగళవారం తీర్పు చెప్పారు. తిరుమలగిరి మండలం చింతలపాలెం ఆవాస గ్రామమైన నాగార్జునతండాకు చెందిన కొర్ర జైపాల్, కొర్ర సంజకు భూ తగాదాలు ఉన్నాయి. 2017 సెప్టెంబర్ 1న కొర్ర సంజ తన కుమారులు రామ్‌చంద్, వెంకన్నతో కలసి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లారు. అప్పటికే కొర్ర జైపాల్ కుటుంబ సభ్యులతో కలసి జేసీబీతో పొలం చదును చేస్తున్నాడు. పొలాన్ని ఎందుకు చదును చేస్తున్నారని కొర్ర సంజ కుమారుడు వెంకన్న వారిని అడిగాడు. దీంతో కొర్ర జైపాల్ వచ్చి అతన్ని తిట్టి నోటితో కొరికి గాయపర్చాడు. కొర్ర వెంకన్న తండ్రి సంజ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కుర్మయ్య కేసు నమోదు చేశారు. మంగళవారం నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టులో తుది విచారణలో కొర్ర జైపాల్‌పై నేరం రుజువు కావడంతో నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని లేదా వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.